క్లుప్తంగా

భక్తులతో కిటకిటలాడిన పారిజాత గిరి



పారిజాతగిరి వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రీతికరమైన రోజు శనివారం కావడంతో వేకువ జామున సుప్రభాత సేవ, తోమాల సేవ, ఆరాధన, తీర్థప్రసాదగోష్టి తదితర పూజలు చేశారు. స్వామి వారిని విశేషంగా అలంకరించగా, భక్తులు స్వామి వారిని దర్శించుకుని, మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు కొణతం రవితేజ, శ్రీదివ్య, ఇండియన్ బ్యాంకు మేనేజర్ సురేంద్రల సౌజన్యంతో ఉచిత అన్నప్రసాద వితరణ చేశామని ఈఓ మానికల రాంబాబు తెలిపారు. దాతలను ఆలయ అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు, రుషికేష్ ఆచార్యులు, రాఘవాచార్యులు తదితరులు వేదాశీర్వాదంతో సత్కరించారు. కార్యక్రమాలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల జగపతిరాజు, రెడ్డి రంగప్రసాదు, వాసవి సాయి నగేష్‌లు పర్యవేక్షించారు.

అంజన్నకు అభిషేక సేవ



అంజన్నకు అభిషేకం చేస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆలయంలో శనివారం సందర్భంగా ఆంజనేయస్వామికి అభిషేక సేవ నిర్వహించారు. ఆలయ ముఖమండపంపై స్వామివారి ఉత్సవమూర్తికి అర్చకులు శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవల, విరాళాల ద్వారా రూ.2,17,498 సమకూరినట్టు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు.

శ్రీవారికి వెండి చెంబులు బహూకరణ



శ్రీ వెండి చెంబులను అందిస్తున్న దాత మన్మధరావు కుటుంబం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్నకు కృష్ణా జిల్లా ముసునూరు గ్రామానికి చెందిన బాల మన్మధరావు శనివారం రూ.1.70 లక్షలు విలువైన వెండి చెంబులను బహూకరించారు. శంఖు, చక్ర, నామాలతో తయారు చేసిన 2 కేజీలు బరువు గల 10 వెండి చెంబులను ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తికి అందజేశారు. వీటిని స్వామివారి పూజా కార్యక్రమాలకు వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా ఈఓ దాతకు సంబంధిత రసీదును, స్వామివారి ప్రసాదాలను అందించి, అభినందించారు. తొలుత దాత కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

కార్యకర్తకు నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ కార్యకర్త ముప్పిడి ప్రసాద్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు శనివారం పరామర్శించారు. ఇటీవల ప్రసాద్ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. బాలరాజు ప్రసాద్ కుటుంబాన్ని ఓదార్చి కుటుంబానికి పార్టీ అండగా నిలబడుతుందని భరోసా కల్పించారు. ప్రసాద్ చిత్రపటానికి పార్టీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. ప్రసాద్ మృతి టౌన్ విభాగానికి తీరని లోటన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి చేసిన కృషిని ఆయన గుర్తుకు తెచ్చుకున్నారు. నూకల రాము, తొంటా వాసు, ముప్పిడి వంశీ, ఘంటసాల మధు, కడిమి సూరి, తదితరులు పాల్గొన్నారు.

ధూమపానం వద్దు... ఆరోగ్యమే ముద్దు

గణపవరం: ధూమపానం చేసే వ్యక్తితో పాటు తనచుట్టూ ఉన్న వ్యక్తుల ఆరోగ్యానికి కూడా చేటు చేస్తున్నారని, సమాజంలో ధూమపానం లేకుండా చూడటమే మనందరి లక్ష్యం కావాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఓంకార్‌నాథ్, పి.కిరణ్మయి అన్నారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సి సిబ్బంది నోటు బాకోడే కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సి సిబ్బంది పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. ధూమపానం వద్దు, ఆరోగ్యం ముద్దు, పొగతాగడం ఆరోగ్యానికి హానికరం, మత్తుపదార్థాలు వద్దు, పౌష్టికాహారం ముద్దు అంటూ నినాదాలు చేశారు.

కూటమి ప్రభుత్వంలో వైద్య రంగం కుదేలు

- అందుబాటులో లేని 108, 104 వాహనాలు
- వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటింటికీ వైద్య సేవలు



చింతలపూడి : 25 కోట్లతో నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి భవనాలు



బుట్టాయగూడెం : రేపల్లెకు కాలినడకన వెళ్తున్న వైద్య బృందం (ఫైల్)



బుట్టాయగూడెం : దోలుగండిలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం (ఫైల్)



బుట్టాయగూడెం : రేగులపాడులో ఇంటి వద్దే వైద్యం అందిస్తున్న డాక్టర్లు (ఫైల్)

బుట్టాయగూడెం: ఫ్యామిలీ డాక్టర్ ఐదేళ్ల క్రితం ధనవంతులకే పరిమితమైన వైద్యం. దీనిని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మారుమూల గిరిజన గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు సైతం చేరువ చేశారు. ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులను నియమించి వారిని గ్రామాలకు పంపించి అక్కడి రోగులకు వైద్య పరీక్షలు చేయించి, అవసరమైన మందులను అందజేసేవారు. ప్రాథమిక దశలోనే గుర్తించడంతో వ్యాధులు త్వరగా నయమయ్యేవి. రోగులకు ఇంటి వద్దే మెరుగైన వైద్యసేవలు, మందులు అందేవి. చాలా మందికి ఆస్పత్రికి వెళ్ళే అవసరంలేకుండా ఉండేది. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఫ్యామిలీ డాక్టర్ వైద్యాన్ని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. వైఎస్సార్ సీపీ పాలనలో గిరిజన గ్రామాల్లో సరైన రహదారులు లేకపోయినా ఫ్యామిలీ డాక్టర్ పథకంలో వైద్యులు మైళ్ల దూరం నడుకుంటూ వెళ్లి గిరిజనులకు వైద్యసేవలు అందించేవారు. సీజనల్ వ్యాధుల నివారణకు కృషి చేసేవారు. బుట్టాయగూడెం మండలంలోని వీరన్నపాలెం, ముంజులూరు, ఒర్రింక, గ్రామాలతో పాటు పోలవరం మండలంలోని కొల్లుమామిడి, గడ్డపల్లి, గిన్నేపల్లి, తదితర మారుమూల గ్రామాల్లో కూడా మెరుగైన వైద్యసేవలు అందేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలనలో ఆయా గ్రామాల్లో గ్రామస్థాయి వైద్యం పడకవేసిందని పలువురు విమర్శిస్తున్నారు.

ఆదుకున్న ఆరోగ్యశ్రీ

వైఎస్సార్ సీపీ పాలనలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆగిపోయే గుండెతోపాటు పలు వ్యాధులకు లక్షలాది రూపాయలతో వైద్య సేవలు అందించారు. పోలవరం నియోజకవర్గంలో సుమారు 7736 మందికి సుమారు రూ.19.24 కోట్లతో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలు అందించారు. 108, 104 వాహనాల ద్వారా లక్షలాది మంది ప్రజలకు మెరుగైన సేవలు అందించారు.

హామీల అమలులో విఫలం

చింతలపూడి : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను గాలికి వదిలేసింది. ఏడాది నుంచి రైతులకు రైతు భరోసా అందించలేదు. విత్తనాలు, ఎరువులు సరఫరాలో పూర్తిగా విఫలమైంది. ఇక వైద్య రంగం పూర్తిగా నిర్వీర్యమైంది. 108, 104 వాహనాలు కూడ అందుబాటులో ఉండటం లేదని రోగులు ఆరోపిస్తున్నారు.

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక వైద్యరంగం మరింత అభివృద్ధి సాధించింది. వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకంలో 11,281 మంది లబ్ధిదారులకు రూ.45.36 కోట్లు, 61 విలేజ్ క్లినిక్స్ కోసం మొత్తం రూ.11.22 కోట్లు ఖర్చు చేశారు. గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ప్రాథమిక ఆరోగ్యం విషయంలో అట్టడుగు స్థాయిలో ఉన్న ఏపీని నెంబర్ ఒన్ స్థాయికి తీసుకురావడమే కాక కేంద్ర ప్రభుత్వ ప్రసంశలు అందుకునే స్థాయికి జగన్ తీసుకొచ్చారు. ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కళాశాల, ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు సంకల్పించారు. అందుకు అనుగుణంగా నిధులు మంజూరు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరించారు. డాక్టర్ల కొరత, మందుల కొరత లేకుండా చేశారు. చింతలపూడి నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తికావొచ్చింది. ఐదు బ్లాకులుగా అత్యంత భారీగా భవనాలను నిర్మాస్తున్నారు. అత్యాధునిక వైద్య పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. రూ.25 కోట్ల వ్యయంతో 95,000 చదరపు అడుగుల వైశాల్యంలో ఆసుపత్రి భవనాలను నిర్మిస్తున్నారు.

అటకెక్కిన ఫ్యామిలీ డాక్టర్



ఫ్యామిలీ డాక్టర్ పథకంలో గిరిజన గ్రామాల్లోనే డాక్టర్‌లు పర్యటించి మెరుగైన వైద్యసేవలు అందించారు. దానివల్ల గిరిజనులు ఎటువంటి రోగాల బారిన పడకుండా ఎంతో ఆరోగ్యంగా ఉండేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అటకెక్కినట్లు కనిపిస్తుంది.

– తెల్లం భీమరాజు, దుద్దుకూరు, బుట్టాయగూడెం మండలం

రైతు సంక్షేమమే ధ్యేయం



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేసింది. ప్రతి ఏడాది రైతు భరోసా, జలకళ ద్వారా ఉచితంగా బోరు వేశారు. గతంలో ఎన్నడు లేని విధంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటుచేసి ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు సకాలంలో సబ్సిడీ ద్వారా అందించారు.

– గంగు హరిప్రసాద్ రెడ్డి, రైతు, జలపవారిగూడెం, కామవరపుకోట మండలం

జూనియర్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ కోర్సు

బుట్టాయగూడెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025 – 26 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ వృత్తి విద్యా కోర్సుగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ కోర్సు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంజీవని కుసుమ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీ గిరిజన ప్రాంత విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు పెంచే దిశగా ఒకేషనల్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ కోర్సు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ఎంసెట్ ద్వారా కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఐటీ, తదితర ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరవచ్చని తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్స్, డీఎస్సీ ఎలక్ట్రానిక్స్, మొదలైన ఉన్నత విద్యలను డిగ్రీ స్థాయిలో అభ్యసించవచ్చని వివరించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా జూనియర్ ప్రోగ్రామర్, కంప్యూటర్ ఆపరేటర్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, మొదలగు ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. కళాశాలలో అడ్మిషన్స్ ప్రారంభమయ్యాయని, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

నాసిరకంగా రోడ్డు నిర్మాణం

నిర్మించిన పది రోజుల్లోనే కుంగుబాటు



చక్రదేవరపల్లి మీదుగా వేగవరం వరకు నిర్మించిన రోడ్డులో కుంగిపోయిన తూము



బీటలు వారిన బీటీ రోడ్డు

జంగారెడ్డిగూడెం: పట్టుమని పది రోజులు కాకుండానే వేసిన బీటీ రోడ్డు మరమ్మతులకు గురైంది. ఏళ్ల తరబడి రోడ్డు నిర్మాణానికి ఎదురుచూసిన ఆయా గ్రామాల ప్రజలకు నిరాశే ఎదురైంది. జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం నుంచి చక్రదేవరపల్లి మీదుగా కొంగువారిగూడెం ఎర్రకాలువ ప్రాజెక్టును కలుపుతూ వేగవరం వరకు 5.4 కిలో మీటర్లు మేర బీటీ రోడ్డు నిర్మించారు. దీనికి నాబార్డు నిధులు రూ.3 కోట్లు వెచ్చించారు. ఈ రోడ్డు నిర్మించి సుమారు 10 రోజులు దాటింది. ఇటీవల ప్రాజెక్టులోని గ్రావెల్ వేశారు. తాజాగా ఈ రోడ్డులో ఉన్న తూము కుంగిపోయింది. దీంతో హడావుడిగా గ్రావెల్ వేసి తూతూమంత్రంగా మరమ్మతులు చేశారు. వాస్తవానికి ఈ తూమును కల్వర్టుగా మార్చి కాంక్రీట్‌తో నిర్మించాల్సి ఉంది. తూరలు పెట్టి నిర్మాణంలో నాణ్యత లేకుండా గ్రావెల్‌తో పూడ్చి దానిపైన గ్రావెల్, మెటల్‌తో బీటీ వేసి మమ అనిపించారు. తాజాగా, రెండు రోజుల క్రితం తూము కుంగిపోయింది. దీనిపై గ్రావెల్ వేసి కప్పి పుచ్చే ప్రయత్నం చేశారు. రోడ్డుకు ఇరువైపులా అప్పుడే బీటలు వారి ధ్వంసమవుతోంది. కొద్ది రోజులు ఈ రోడ్డుపై వాహనాలు తిరిగితే రోడ్డు మొత్తం ధ్వంసమవుతుందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. నాణ్యత లేకుండా రోడ్డును నిర్మించారని విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు ఇంకా బిల్లులు అవలేదని తెలిసింది. తనకు బిల్లులు అయ్యే వరకు పెద్ద వాహనాలు ఈ రోడ్డుపై తిప్పవద్దని కాంట్రాక్టర్ వాహనచోదకులను కోరినట్లు తెలిసింది.

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం



బయ్యన్నగూడెం పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం

కొయ్యలగూడెం: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం బయ్యనగూడెం పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు వల్ల సంభవించే అనర్థాలను వైద్యాధికారులు వి.సత్యనారాయణ, ఎం గీతారాణి వివరించారు. పొగాకు, సిగరెట్, చుట్టలను ధూమపానంగా సేవించడం నేడు అత్యంత ప్రమాదకరంగా మారిందన్నారు. పొగ తాగే వారు ఆక్టివ్ స్మోకర్స్ అని, పొగ పీల్చే వారు పాసివ్ స్మోకర్స్ అని, ఇరువురికీ కాన్సర్ సంక్రమించే అవకాశం ఉందని, నోటి కాన్సర్ వల్ల ఆహారం తీసుకోవటం కూడా కుదరదని, తద్వారా ఆరోగ్యం క్షీణిస్తుందని, పొగాకు పీల్చడం వల్ల ఊపిరి తిత్తులు పాడైపోతాయని, గుండె జబ్బులు కూడా వస్తాయని తెలిపారు. యువత స్మోకింగ్‌కి దూరంగా ఉండాలన్నారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్ సుబ్రహ్మణ్యం, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మస్తర్లలో మాయాజాలం



కన్నాపురంలో పనిప్రాంతంలో కూర్చుని ఉన్న కూలీలు

కొయ్యలగూడెం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అవినీతికి అడ్డాగా మారిందని కూలీలు విమర్శలు చేస్తున్నారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాల కల్పించడం లేదని, తమ నుంచి ప్రతివారం డబ్బులు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. పనికి రాని వ్యక్తుల పేర్లతో మస్తర్లు వేసి నిధులు స్వాహా చేస్తున్నారని చెబుతున్నారు. నిజంగా పని చేసే తమకు చేసిన పనికి సరిపడా వేతనం లభించడం లేదంటున్నారు. వచ్చిన కొద్దిపాటి సొమ్ములో మామూలు అంటూ వసూళ్లకు పాల్పడుతున్నారని, కొన్ని మార్లు వేతనం రావడానికి కూడా తీవ్రమైన జాప్యం అవుతోందని అంటున్నారు. ప్రతివారం పనులకు వచ్చే కూలీ రూ.150 చెల్లించాల్సిందేనని, అదే పనికి రాకుండా మస్తర్లు పొందుతున్న వారయితే వారంలో సగం వేతనం ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వుల ప్రకారం పని ప్రదేశాల్లో టెంట్, మంచినీరు, ప్రథమ చికిత్స కిట్‌లు తప్పనిసరిగా ఉండాలి, కానీ అవి అమలుకు నోచుకోలేదని చెబుతున్నారు. వేతనాల విషయంలో గట్టిగా వాదిస్తుంటే తమ జాబ్ కార్డులు రద్దు చేస్తామని బెదిరిస్తున్నారని వాపోతున్నారు. కొన్నిచోట్ల కాలక్షేపానికి వచ్చి కూలీలు కబుర్లు చెప్పుకుంటూ సమయం ముగిసేసరికి ఇళ్లకు తిరుగు ముఖం పడుతున్నారని రైతులు విమర్శిస్తున్నారు. కూలీల నుంచి సొమ్ములు ఎందుకు వసూలు చేస్తున్నారో స్పష్టత లేకపోవడం వల్ల అసంతృప్తి నెలకొందంటున్నారు. వసూళ్లు చేసేది సిబ్బంది అయినా అధికారుల కనుసన్నలలోనే తతంగమంతా నడుస్తోందని విమర్శిస్తున్నారు.

శేష జీవితం సుఖవంతం



సీతారామ లక్ష్మణస్వామి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ఆలయాలకు వచ్చే భక్తులకు అంకిత భావంతో సేవలందించే ఉద్యోగుల శేషజీవితాలు సుఖవంతంగా సాగుతుందని శ్రీవారి దేవస్థానం ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి అన్నారు. చిన వెంకన్న ఆలయంలో ఏఈఓగా పనిచేస్తున్న రావిపాటి సీతారామ లక్ష్మణస్వామి, డ్రైవర్ ఎ.జియన్నలు శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా లక్ష్మణస్వామి, జియన్న దంపతులను ఈఓ తన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. వారికి స్వామివారి ప్రత్యేక దర్శనం, అర్చకులు, పండితుల వేద ఆశీర్వచనాన్ని అందించారు. లక్ష్మణస్వామి 38, జియన్న 33 ఏళ్ల సర్వీసును పూర్తి చేసి, అందరి మన్ననలు పొందారని ఈఓ మూర్తి కొనియాడారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ వాసు, డీఈ టి.సూర్యనారాయణ, సూపరింటెండెంట్‌లు రమణరాజు, ఐవీ రామారావు, సీనియర్ అసిస్టెంట్ కంప్యూటర్ శ్రీను తదితరులున్నారు.

అంకితభావంతో పనిచేయాలి

ఏలూరు (టూటౌన్): ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు త్వరితగతిన నాణ్యమైన సేవలు అందించేందుకు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు అంకిత భావంతో పనిచేయాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్ పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో శాశ్వత లోక్ అదాలత్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల నాణ్యమైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ రవాణ, పోస్టల్, బ్యాంకింగ్, విద్య, వైద్య, ఇన్సూరెన్స్, రియల్ ఎస్టేట్, ఉపాధి హామీ, రియల్ ఎస్టేట్ మొదలైన సేవలలో లోపం జరిగిన శాశ్వత లోక్ అదాలత్‌లో సంప్రదించవచ్చన్నారు. కక్షి దారులు నేరుగా లేక పారా లీగల్ వలంటీర్ల ద్వారా కూడా అర్జీలను అందజేయవచ్చని, రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ మాట్లాడుతూ జూలై 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. సమస్యలను నేరుగా లేదా 15100 ద్వారా పరిష్కరించుకోవచ్చని అన్నారు.

ఘనంగా నాట్య నిలయం వార్షికోత్సవం



చిన్నారులకు జ్ఞాపికలు అందించిన అతిథులు

ఏలూరు (ఆర్ఆర్ పేట): నగరానికి చెందిన శ్రీపాద శ్రీవల్లభ కూచిపూడి నాట్య నిలయం 10వ వార్షికోత్సవం శనివారం స్థానిక దొండపాడు శ్రీ నందత్తనాథ క్షేత్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా సాహితీవేత్త లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కోరాడ నరసింహారావు, శోభా నాయుడు, వెంపటి చినసత్యం వంటి నాట్య గురువుల కృషి వల్ల తెలుగువారి సాంప్రదాయ నృత్యమైన కూచిపూడి ప్రపంచ దేశాలన్నిటిలోనూ అగ్రస్థానానికి చేరిందని వివరించారు. నాట్య గురువు మేదరమెట్ల శిరీష మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అధికార నృత్యమైన కూచిపూడి నాట్య దినోత్సవాన్ని కూచిపూడి నాట్య పితామహుడు సిద్ధేంద్ర యోగి జయంతి నాడు అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారని తెలిపారు. ప్రతి జిల్లా కేంద్రాల్లో కూచిపూడి నాట్య కళాశాలలను ఏర్పాటు చేయాలని, చదువులతో పాటు కళల వైపుగా పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. సీఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకురాలు అనిత కుమారిని ఆదర్శ మహిళ అవార్డుతో సత్కరించారు. రూ.25 వేలు విలువ చేసే కూచిపూడి నాట్య ఉచిత శిక్షణ 2025 వార్షిక స్కాలర్‌షిప్‌ను గంధం ప్రణవి, యర్రా వైష్ణవిలకు అందించారు. కార్యక్రమంలో పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శనలతో అలరించారు. అనంతరం వేసవి శిక్షణా శిబిరంలో కూచిపూడి నాట్యం నేర్చుకున్న 80 మంది విద్యార్థులకు జ్ఞాపికలు బహూకరించారు.

చౌక డిపోల వద్దే రేషన్ పంపిణీ



డీఎల్ ప్రమద్వర

చింతలపూడి : జూన్ ఒకటో తేదీ నుంచి చౌక డిపోల వద్దే రేషన్ సరుకులు తీసుకోవాలని తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర లబ్ధిదారులను కోరారు. శనివారం తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో రేషన్ చౌక డిపోల వద్ద ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల్లోపు సరుకులు పొందవచ్చన్నారు. 65 ఏళ్లు దాటిన వారికి, వికలాంగులకు ఇంటి వద్దే డీలర్లు వచ్చి సరుకులు అందిస్తారని తెలిపారు.

వేసవి శిక్షణా తరగతులు



పుస్తకపఠనం చేస్తున్న విద్యార్థులు

లింగపాలెం: మండలంలోని ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా శనివారం విద్యార్థులకు స్కిప్పింగ్ పోటీలు నిర్వహించామని గ్రంథాలాయాధికారిణి సీహెచ్‌వీ రమణ తెలిపారు. పరమానందయ్య శిష్యులు కథను వివరించడంతో పాటు జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలను సంధించి, వివరణలు ఇచ్చామని చెప్పారు. పుస్తక పఠనం, పుస్తక సమీక్షా కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణానికి విరాళాలు



షెడ్డు నిర్మాణానికి విరాళం అందిస్తున్న దాతలు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో షెడ్డు నిర్మాణానికి శనివారం దాతలు పోలుపర్తి రాము, సత్యవతి దంపతులు రూ.50,116, బైపురెడ్డి శ్రీను, శారద దంపతులు రూ.50,116 విరాళంగా అందజేశారని ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. ఆలయంలో నూకాలమ్మవారికి నిత్య పూజలు, సాయం సంధ్యా హారతి పూజలు అర్చకులు నిర్వహించారు.

కులమతాలకు అతీతంగా మెలగాలి

గణపవరం: గ్రామంలోని ప్రజలంతా కుల,మత, వర్గబేధాలు లేకుండా ఐకమత్యంగా మెలగాలని, అప్పుడే గ్రామం ప్రశాంతంగా అభివృద్ధి బాటలో పయనిస్తుందని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ సెల్ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. శనివారం జాతీయ పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా గణపవరంలో సీవిల్ రైట్ దినోత్సవాన్ని తహసీల్దార్ అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. మంగరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ప్రాథమిక హక్కులు, బాధ్యతలు ఉంటాయని, ఎస్సీ, ఎస్టీ పట్ల వివక్ష చూపకుండా సోదర భావంతో ఉండాలని సూచించారు. కులవివక్ష చూపినవారికి చట్టంలో కఠిన శిక్షలు ఉన్నాయన్నారు. తహసీల్దార్ అప్పారావు మాట్లాడుతూ ప్రజలూ కలసి మెలసి ఉంటేనే గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. సర్పంచ్ కురెళ్ల వెంకటరత్నం, ఎంపిడివో బేబీ శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.